సాక్షి
ఏలూరు
శుక్రవారం । 5 । ఏప్రిల్ । 2024




రూ.9 లక్షల నగదు సీజ్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద వాహనాలను అధికారులు తనిఖీ చేశారు. రూ.9 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. IIలో ▸



'ఉపాధి' కూలీలకు ఊరట

ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు 2024–25కి సంబంధించి ఏప్రిల్ నుంచి వేతనాల పెంపుతో అంతటా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. IIలో ▸



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్రవారం (సాయంత్రం)	సహరి శనివారం (ఉదయం)
ఏలూరు	6.26	4.33
భీమవరం	6.24	4.35

న్యూస్‌రీల్

కొవ్వలిలో సంబరాలు



ప్రమాణ స్వీకారం చేస్తున్న గొల్ల బాబూరావు

దెందులూరు: ఏలూరు జిల్లా దెందులూరు మండలంలోని కొవ్వలి వాసి, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు గురువారం న్యూఢిల్లీలో రాజ్యసభలో ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా కొవ్వలిలో కుటుంబ సభ్యులు, బంధువులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అనుచరులు, అభిమానులు, గ్రామస్తులు స్వీట్లు పంచి బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. బాబూరావు ఎంపీగా ప్రమాణస్వీకారం చేయడం శుభపరిణామమని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పల్లెం ప్రసాద్ అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, పార్టీ జిల్లా కార్యదర్శులు గొల్ల కిరణ్, గొల్ల వీరాస్వామి, కొంగర రత్నకుమార్ అబ్బాస్, చల్లా మేరిరాజు, మానవహక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనికెళ్ల మురళీ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

సిబ్బంది ర్యాండమైజేషన్

ఏలూరు(మెట్రో): సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వర్తించే సిబ్బంది మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం ఆన్‌లైన్‌లో సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టారు. జిల్లాలో 1,750 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన మొత్తం 11,798 మందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. అందులో 2,150 మంది ప్రిసైడింగ్ అధికారులు, 2150 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 7,498 మంది ఇతర పోలింగ్ అధికారులు ఉన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం 25 శాతం అదనంగా సిబ్బందిని కేటాయించారు. జేసీ బి.లావణ్య వేణి, డీఆర్వో డి.పుష్పమణి ఉన్నారు.

544 అభ్యర్థనలకు అనుమతి

ఎన్నికల ప్రచారానికి సంబంధించి అందిన 544 అభ్యర్థనలకు అనుమతులు జారీ చేసినట్టు కలెక్టర్ తెలిపారు. బుధవారం రాత్రి వరకు 816 అభ్యర్థనలు రాగా 544 అనుమతులు జారీ చేయగా మరో 12 పరిశీలనలో ఉన్నాయన్నారు. సరైన రీతిలో దరఖాస్తు చేయని 260 తిరస్కరించామన్నారు. సీ–విజిల్ ద్వారా 247 ఫిర్యాదులు అందగా 150 పరిష్కరించామన్నారు. మీడియాలో ఎన్నికల ఉల్లంఘనలకు వచ్చిన 78 ఫిర్యాదులు పరిష్కరించామన్నారు. జిల్లాలో మొత్తంగా రూ.135.39 లక్షల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులు సీజ్ చేశామన్నారు.

ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలి



ఎస్పీ మేరీ ప్రశాంతి

జంగారెడ్డిగూడెం: ఎన్నికలు సజావుగా జరిగేందుకు రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని జిల్లా ఎస్పీ డి. మేరీ ప్రశాంతి అన్నారు. జంగారెడ్డిగూడెం డీఎస్పీ కార్యాలయంలో ఆమె విలేకరుల స మావేశం నిర్వహించా రు. జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ పరిధిలోని లా అండ్ ఆర్డర్ పరిశీలించేందుకు వచ్చినట్లు చెప్పారు. పోలింగ్ బూత్‌లు, సమస్యాత్మక ప్రాంతాలు, బైండోవర్‌లు, ఎన్నికల నియమావళి ఉల్లంఘటనలు త దితర విషయాలను పరిశీలించామన్నారు. సోషల్ మీడియాలో పెట్టే పోస్టులపై ఎన్నికల సంఘంతో పాటు పోలీసు శాఖ కూడా ప్రత్యేక నిఘా ఉంచిందన్నారు. అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. పోస్టుల విషయంలో అడ్మిన్‌లు బాధ్యత వహించాల్సి ఉంటుందని జాగ్రత్తగా ఉండాలన్నారు. డీఎస్పీ యు.రవిచంద్ర, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

పక్కాగా శిలాఫలకాలు కప్పి ఉంచాం

ఏలూరు(మెట్రో): ఏలూరులో ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో శిలాఫలకాలపై ప్రజాప్రతినిధుల పేర్లు కనిపించకుండా మూసివేసిన వస్త్రాలు జారిపోతున్నాయనే వచ్చిన ఫిర్యాదుపై ఏలూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.ముక్కంటి వివరణ ఇచ్చారు. ఏలూరులో ఎన్నికల నియమావళి ప్రకారం శిలాఫలకాల్లో ప్రజాప్రతినిధుల పేర్లు కనిపించకుండా పకడ్బందీగా వస్త్రాలను కట్టామని గురువారం ప్రకటనలో తెలిపారు.

ముగిసిన మూల్యాంకనం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం గురువారంతో ముగిసింది. గత నెల 9న స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంస్కృతం జవాబు పత్రాల మూల్యాంకనంతో ప్రారంభం కాగా 18 నుంచి ఇతర సబ్జెక్టులకు సంబంధించిన మూల్యాంకనం ప్రారంభమైంది. 105 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 545 మంది ఎగ్జామినర్లు, 105 మంది స్క్రూటినైజర్లు మొత్తం 755 మంది పాల్గొన్నారు.

కళ్లు చల్లబడ్డాయా బాబూ!



తాడేపల్లిగూడెం రూరల్: పట్టింపాలెం సచివాలయానికి నడుచుకుంటూ వస్తున్న వృద్ధురాలు

కక్షతో ఏడిపించెన్

- టీడీపీ కుట్రలతో పెన్షన్ కష్టాలు
- అవ్వాతాతలకు అవస్థలు
  - మండే ఎండల్లో పడిగాపులు
  - ఆందోళనలో ఇద్దరు మృతి
  - చంద్రబాబు కుతంత్రాలపై మండిపాటు
  - జిల్లాలో 89.92 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి





పింఛన్ పాట్లు.. ఆకివీడులోని మాదివాడ సచివాలయం వద్ద పింఛన్ల కోసం వేచి చూస్తున్న వృద్ధులు

ఓ పక్క మండుతున్న ఎండలు.. మరోపక్క వడగాల్పులతో పింఛన్ సొమ్ముల కోసం వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర అవస్థలు పడ్డారు. ప్రతినెలా ఒకటో తారీఖున వేకువజామునే చిరునవ్వులతో పింఛన్ అందించే వలంటీర్‌లను దూరం పెట్టి తమకు కష్టాలు తెచ్చిపెట్టిన చంద్రబాబూ కళ్లు చల్లబడ్డాయా! అంటూ వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. తారెత్తిన ఎండల్లో పింఛన్ డబ్బుల కోసం సచివాలయాలకు పరుగులు తీశారు. జిల్లాలో రెండో రోజు గురువారం 89.92 శాతం మేర పింఛన్ల పంపిణీ పూర్తి చేశారు. జిల్లాలో పెన్షన్ ఆందోళనలో ఒకరు, పెన్షన్ కోసం వెళ్లి వచ్చి అస్వస్థతకు గురై మరొకరు అనారోగ్యంతో మృతి చెందారు.

కుప్పకూలి.. కాలు విరిగి..



చాట్రాయి: చాట్రాయి మండలంలోని సి.గుడిపాడు గ్రామానికి చెందిన నక్కా మంగతాయారు వృద్ధురాలు. గురువారం రెండు కిలోమీటర్ల దూరంలోని నరసింహారావుపాలెం గ్రామ సచివాలయానికి నడుచుకుంటూ వచ్చి పెన్షన్ తీసుకున్నారు. తిరిగి ఇంటికి వెళుతుండగా మండుటెండలో కళ్లు తిరగడంతో రోడ్డుపై కుప్పకూలారు. దీంతో ఆమె చేయి విరిగింది. కుటుంబసభ్యులు ఆమెను విస్సన్నపేట ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఎక్స్‌రే తీసిన వైద్యులు కుడి కాలు, కుడి చేయి విరిగినట్టు చెప్పారు. ఇంటి వద్దకే వలంటీర్ వచ్చి పెన్షన్ ఇస్తే తనకు ఈ ప్రమాదం జరిగేది కాదని మంగతాయారు ఆవేదన వ్యక్తం చేశారు.



ఏలూరులో చోడేదిబ్బ సచివాలయానికి వస్తున్న వృద్ధులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఎన్నికల సంఘం ఆదేశాలతో బుధవారం నుంచి జిల్లాలో పెన్షన్ ప్రక్రియ ప్రారంభమైంది. మొదటిరోజు 31 మండలాల్లో 1,30,176 మందికి పెన్షన్ అందజేసి 48.07 శాతం పూర్తి చేశారు. రెండో రోజు గురువారం కూడా ఉదయం 8 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు 31 సచివాలయాల పరిధిలో పంపిణీ ప్రక్రియ కొనసాగింది. మొత్తంగా 89.92 శాతం పూర్తయ్యింది. ఏలూరు అర్బన్‌లో అత్యధికంగా 94.9 శాతం, జంగారెడ్డిగూడెంలో 93.68 శాతం, నూజివీడులో 93.35 శాతం, చింతలపూడిలో 93.18 శాతం, దెందులూరులో 92.87 శాతం, నూజివీడు అర్బన్‌లో 92.87 శాతం, పెదవేగిలో 92.79 శాతం, పెదపాడులో 92.44 శాతం పూర్తిచేశారు. మొత్తంగా 16 మండలాల్లో 90 శాతానికిపైగా పెన్షన్ పంపిణీ పూర్తయ్యింది. జిల్లావ్యాప్తంగా 2,70,804 మంది పెన్షన్ అందించాల్సి ఉండగా 2,43,498 మందికి గురువారం రాత్రి వరకు అందజేశారు. మొత్తం రూ.80.92 కోట్లు విడుదల కాగా ఇప్పటివరకు రూ.73.89 కోట్ల పంపిణీ పూర్తయ్యింది. అధికారులు సచివాలయాల వద్ద టెంట్లు, మంచినీటి వసతి ఏర్పాటు చేశారు.

ఇద్దరు మృతి : నూజివీడు నియోజకవర్గం చాట్రాయి మండలం చీపురుగూడెం గ్రామానికి చెందిన మేకల తిరుపతయ్య (70) జ్వరంతో నీరసంగా ఉండి కూడా పెన్షన్ తీసుకోవడానికి గురువారం మధ్యాహ్నం బయలుదేరి ఇంటి ముందే పడిపోయి మృతి చెందాడు. ఉంగుటూరు మండలం కైకరం గ్రామానికి చెందిన జనపరెడ్డి అప్పలనర్సమ్మ (87) పెన్షన్ తీసుకోవాలనే ఆతృతలో సచివాలయానికి బయలుదేరి మార్గమధ్యలోనే అస్వస్థతకు గురై మృతి చెందింది.

వలంటీర్లను దూరం చేయడం తగదు



ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ డబ్బులు ఇచ్చేవారు. వారి సేవలపై ఆంక్షలు విధించడంతో మాలాంటి వారు ఇబ్బంది పడాల్సి వస్తోంది. వృద్ధుల ఇబ్బందులు గుర్తించి ఇంటి వద్దకే పింఛన్ అందించేలా సీఎం జగన్ వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారు. వలంటీర్ల సేవలు దూరం చేయడం తగదు.

–గుర్రం రామదాసు, పుట్లగట్లగూడెం

ఉసురు తగులుతుంది



చేసిన పాపం అంతా చేసి ఇప్పుడు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ పెన్షన్ల పంపిణీని ప్రభుత్వం తమ సిబ్బందితో చేయాలని నీతులు చెబుతుండటం సిగ్గుచేటు. పెన్షన్ల మీద ఆధారపడి జీవిస్తున్న వృద్ధుల ఉసురు వాళ్లకు తగలకపోదు. వలంటీర్లు ఒకటో తారీఖున వేకువజామునే ఇంటికి వచ్చి పింఛన్ అందించేవారు.

– యడ్లపల్లి ఆమోషు, చొప్పరామన్నగూడెం



కుక్కునూరులో వృద్ధుడి అవస్థ

రాజకీయ కుట్రలతో..



నేను నరసాపురం మూడో వార్డులో ఉంటున్నాను. బీపీ, మోకాళ్ల నొప్పులు ఉన్నాయి. గతంలో వలంటీర్లే అన్ని చూసుకునేవారు. 1వ తేదీనే డబ్బులు ఇచ్చేవారు. ఇప్పుడు ఎండల్లో సచివాలయానికి వెళ్లి పెన్షన్ తెచ్చుకోవాలంటే చాలా కష్టం. రాజకీయ కుట్రలతో వలంటీర్లను పక్కన పెట్టడం దుర్మార్గం.

– కోడి వీరరాఘవులు, నరసాపురం

కుంటుకుంటూ వచ్చాను



నాకు ఆరోగ్యం సహకరించదు. ఈనెల పింఛన్ కోసం సచివాలయానికి వెళ్లాలనడంతో కుంటుకుంటూ వచ్చాను. ఎండ ఎక్కువగా ఉండటంతో చాలా ఇబ్బంది పడ్డాను. వలంటీర్లు ఉంటే మాకు ఈ ఇబ్బంది ఉండేది కాదు. గతంలో మాదిరి వలంటీర్ల ద్వారా ఇంటి వద్దనే ఇచ్చే ఏర్పాటు చేయాలి.

– సంధి సత్యం, ఆరవల్లి

మళ్లీ పాత రోజులొచ్చాయి



జగన్ పాలనలో ఇంటి వద్దనే పింఛన్ తీసుకున్నాం. నాలాంటి దివ్యాంగులకు వలంటీర్ల సేవలు ఊరటనిచ్చాయి. గత టీడీపీ పాలనలో కార్యాలయాల వద్ద పడిగాపులు పడాల్సి వచ్చేది. జగన్ ప్రభుత్వంలో 1వ తేదీనే పింఛన్ అందిస్తూ వచ్చారు. ఇలాంటి సేవలను దూరం చేయాలని చూడటం బాధాకరం.

– జొన్నమాల సాయి, దివ్యాంగుడు, వేగవరం

వలంటీర్లను చూసి ఓర్వలేక..



వలంటీర్ల సేవలు దేశవ్యాప్తంగా గుర్తింపు రావడం చూడలేక తెలుగుదేశం, జనసేన పార్టీలు చేస్తున్న దుష్ప్రచారం వల్ల ఇప్పుడు ఇంటికే వచ్చి పెన్షన్ల పంపిణీ నిలిచిపోయింది. నీతిమాలిన నాయకులకు రోత కలిగించే రాతలను రాస్తున్న పచ్చ మీడియా తోడు కావడంతో వలంటీర్ల బతుకులు సైతం రోడ్డున పడ్డాయి.

– సంకు ధర్మరాజు, రామానుజపురం

గంటల తరబడి వేచి ఉన్నా..



ఈనెల నుంచి వలంటీర్‌లతో కాకుండా సచివాలయం వద్ద పింఛన్ ఇస్తున్నారని చెప్పడంతో నా మనవడు సహాయంతో వచ్చా. గంటల తరబడి వేచి ఉన్నా. వలంటీర్ ద్వారా పింఛన్ ఇవ్వడం వల్ల మాలాంటి వృద్ధులకు చాలా మేలు జరిగింది. ఇప్పుడు సచివాలయానికి రావాలంటే ఇక్కట్లు పడాల్సి వస్తోంది.

– రంభ సత్తెమ్మ, అత్తిలి

చంద్రబాబుకు ఇది న్యాయమా



సీఎం జగన్ ఇంటి గుమ్మం వద్దకే పింఛన్లు అందించారు. నేడు గత టీడీపీ పాలన మరలా వచ్చిందా అన్నట్లు అనిపిస్తోంది. నడవలేని స్థితిలో ఉన్న మేం సచివాలయానికి వచ్చి పింఛన్ తీసుకోవాలంటే ఎలా కుదురుతుంది. వలంటీర్లను నిలిపివేయించిన చంద్రబాబుకు ఇది న్యాయమా.

– మందరపు గంగాధరరావు, తణుకు

● కోడ్ ఉల్లంఘన కనిపించట్లేదా ?



ఏలూరు ఆర్‌ఆర్‌పేట పార్కు మెయిన్ గేటుపై కనిపిస్తున్న ఎన్‌టీఆర్ పేరు



ముసుగు వేశారు.. పేరు మరిచారు

ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత రాజకీయ నాయకుల విగ్రహాలు, శిలాఫలకాలు, పార్టీ రంగులు కనిపించకుండా చేయాల్సిన బాధ్యత అధికారులదే. అయితే వారికి కనిపించిన వాటికి ముసుగు వేసి ఇంక మనకెందుకులే అని వదిలేశారు. ఏలూరులోని పలుచోట్ల టీడీపీకి సంబంధించిన రంగు, ఆ పార్టీ నేత పేరు స్పష్టంగా కనిపిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇది కోడ్ ఉల్లంఘన కాదా అని పలువురు విమర్శిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు



ముసుగు వేశారు.. రంగు మరిచారు

అవ్వాతాతలపై కక్ష ఎందుకు చంద్రబాబూ

ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్



ఎన్నికల ప్రచారంలో ఓట్లు అభ్యర్థిస్తున్న ఆళ్ల నాని, సునీల్‌కుమార్

ఏలూరు టౌన్: పేదలకు సంక్షేమాన్ని అడ్డుకుంటావు.. అవ్వాతాతలు, దివ్యాంగుల పెన్షన్లపై నీకెందుకు కక్ష చంద్రబాబూ.. మీ హయాంలో ప్రజలకు ఒక్క మంచి పనీ చేయలేని మీకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమం చూస్తే భయం వేస్తుందా అంటూ ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని తీవ్రస్థాయిలో విమర్శించారు. ఏలూరు నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల ప్రచారాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఏలూరు వీవీ నగర్ నుంచి ఎన్నికల ప్రచార భేరి మోగించారు. ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే ఆళ్ల నాని ఇంటింటా ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ మాట్లాడుతూ అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 58 నెలల పాలనలో ఇంటి వద్దకే పెన్షన్లు పంపిణీ చేయించారనీ, పేదల పక్షపాతిగా ప్రభుత్వ పాలన ఇంటి ముంగిటకు చేర్చారని చెప్పారు. అయితే టీడీపీ కూటమి ప్రజలను ఇబ్బందులకు గురిచేసేందుకే కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. మండు వేసవిలో వృద్ధులు సచివాలయాలకు వెళ్లి ఎలా కష్టాలు పడుతున్నారో చూస్తున్నారా అంటూ ప్రశ్నించారు. టీడీపీ, జనసేనకు ప్రజల సంక్షేమంపై చిత్తశుద్ధి లేదన్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో దుష్టశక్తులన్నీ ఏకం అవుతున్నాయనీ, ప్రజలు గమనిస్తున్నారనీ, రాబోయే ఎన్నికల్లో ఓటు ద్వారానే గుణపాఠం చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. ఏలూరు జిల్లాలో ఏడు అసెంబ్లీ, ఎంపీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయటం ఖాయమని వారు తెలిపారు. నగరంలోని 50వ డివిజన్‌లో ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్, కో–ఆప్షన్ సభ్యుడు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎంఆర్ పెదబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆళ్ల నానికి ఘన స్వాగతం పలికారు.

జేఈఈ మెయిన్స్‌కు 470 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జాతీయ స్థాయి విద్యాసంస్థలు నిట్, ట్రిపుల్‌ఐటీల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (జేఈఈ) మెయిన్ రెండో విడత పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఏలూరులోని రెండు కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పరీక్షలు జరిగాయి. తొలిరోజు 530 మందికి గాను 470 మంది హాజరయ్యారు. సిద్దార్థ క్వెస్ట్ కేంద్రంలో ఉదయం 180 మందికి 158 మంది, సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 85 మందికి 75 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం సిద్దార్థ క్వెస్ట్‌లో 180 మందికి 163 మంది, సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 85 మందికి 74 మంది హాజరయ్యారు. పరీక్షలు ఈనెల 12 వరకు కొనసాగనున్నాయి. పరీక్షలకు కో–ఆర్డినేటర్‌గా పి.సాయి కుమారి శంకర్ వ్యవహరిస్తున్నారు.

క్లుప్తంగా

ఉమ్మడి పశ్చిమలో ఇద్దరు జడ్జిల బదిలీ

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర వ్యాప్తంగా 30 మంది జడ్జీలను బదిలీ చేస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దీనిలో భాగంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని ఏలూరు ఒకటో అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్ తిరుపతి ఐదవ, ఫ్యామిలీ కోర్టు జడ్జిగా బదిలీ అయ్యారు. భీమవరం మూడో అడిషనల్ జిల్లా జడ్జిగా పనిచేస్తున్న పి.శ్రీసత్యదేవి స్పెషల్ సెషన్స్ జడ్జి ఎస్సీ, ఎస్టీ కోర్టు విశాఖపట్టణానికి బదిలీ అయ్యారు. ఒంగోలు పోక్సో కోర్టు జడ్జిగా పనిచేస్తున్న ఎంఏ సోమశేఖర్ భీమవరం పోక్సో కోర్టు జడ్జిగా బదిలీపై రానున్నారు. ఇప్పటివరకు ఇక్కడి జడ్జి పోస్టు ఖాళీగా ఉంది. విజయనగరం ఎస్సీ, ఎస్టీ కోర్టు, నాలుగో అడిషనల్ జిల్లా అండ్ సెషన్స్ జడ్జిగా పనిచేస్తున్న షేక్ సికిందర్ తాడేపల్లిగూడెం 9వ అడిషనల్ జిల్లా అండ్ సెషన్స్ జడ్జిగా బదిలీపై రానున్నారు. ఇక్కడి జడ్జి పోస్టు ఇప్పటివరకు ఖాళీగా ఉంది.

నాటు తుపాకీ స్వాధీనం



నిందితుడు, నాటు తుపాకీతో రూరల్ ఎస్సై

కైకలూరు: తనిఖీల్లో భాగంగా సీతనపల్లి గ్రామంలో ఓ వ్యక్తి నుంచి నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నామని రూరల్ ఎస్సై టి.రామకృష్ణ గురువారం చెప్పారు. తమిళనాడు రాష్ట్రం వెల్లూరు జిల్లాకు చెందిన ఎస్.విజయన్ లైసెన్స్ లేకుండా నాటు తుపాకీని తీసుకెళుతుండగా పట్టుకున్నామన్నారు. ఏవరైనా మారణాయుధాలు కలిగి ఉంటే పోలీసు సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఏలూరు టౌన్: చొదిమెళ్ళ ప్రాంతంలో హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు మిర్చి యార్డు ప్రాంతం సాయినగర్ కు చెందిన అన్నవరపు పుష్పరాజు (30) ఈనెల 3న రాత్రి తణుకు నుంచి తన మోటారుసైకిల్‌పై గుంటూరు వెళుతుండగా ఏలూరు నగర శివారు చొదిమెళ్ళ సమీపంలో మోటారుసైకిల్ అదుపు తప్పి రహదారి పక్కనే ఉన్న ఇనుప గ్రిల్స్‌పై పడి తీవ్ర గాయాలపాలై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఏలూరు త్రీటౌన్ పోలీసులు మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఈ ప్రమాదంపై ఏలూరు త్రీటౌన్ సీఐ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు సిబ్బంది కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉపాధి హామీ కూలీలకు ఊరట

- గత ఆర్థిక సంవత్సరంలో రోజుకు కూలీ రూ.272 చెల్లింపు
- ఈ ఏడాది ఏప్రిల్ నుంచి రూ.300కు చేరిన రోజువారీ కూలీ
- ఏలూరు జిల్లాలో 3,68,417 జాబ్ కార్డులు, 6,62,175 కూలీలు
- 2024-25లో లక్ష్యంగా నిర్దేశించిన పనిదినాల సంఖ్య 1.38 కోట్లు
- పెరిగిన వేతనంతో కూలీలకు రూ.41.40 కోట్ల మేర అదనపు లబ్ధి



దెందులూరు మండలం కంద్రిగ నరసింహాపురంలోని గరికి ముక్కుల కుంటలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

ఏలూరు (టూటౌన్) : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ నుంచి వేతనాల పెంపుతో కూలీల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరం 2023-24లో రోజుకు వేతనంగా రూ.272 చెల్లించేవారు. తాజాగా ఈ ఆర్థిక సంవత్సరం నుంచి అదనంగా రూ.28 కలిపి దినసరి వేతనంగా రూ.300 చెల్లించనున్నారు. పేదల జీవనోపాధికి ఉపాధి హామీ పథకం ఎంతగానో దోహదపడుతోంది. వ్యవసాయ పనులు లేని మార్చి నుంచి జూన్ వరకు నాలుగు నెలల పాటు కూలీలకు ఉపాధి పనులు ఎంతగానో ఆదుకుంటున్నాయి. దీంతో ఈ నాలుగు నెలలు ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుంది. గత కొంత కాలంగా ఉపాధి కూలీల వేతనాలు పెంచాలంటూ పలు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు కోరుతూ వస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ఉపాధి కూలీ మొత్తాన్ని ఇప్పటివరకు అందిస్తున్న రూ.272 నుంచి రూ.300కు పెంచారు. ఈ వేసవిలో అత్యధికంగా ఉపాధి పనుల్లో పాల్గొనే ఉపాధి కూలీలకు పెంచిన వేతనాల కారణంగా పెద్ద ఎత్తున లబ్ధి చేకూరనుంది.

జిల్లాలో 3.68 లక్షల జాబ్ కార్డులు

ఉపాధి హామీ పథకంలో ఏలూరు జిల్లా వ్యాప్తంగా మొత్తం 3,68,417 జాబ్ కార్డులు ఉండగా, 6,62,175 మంది ఉపాధి కూలీలు నమోదు చేసుకున్నారు. ప్రతి ఏటా జిల్లాలో కోటి పనిదినాలకు పైగా ఉపాధి కూలీలకు కల్పిస్తున్నారు. వేసవిలో చెరువులు, కాలువలు పూడిక తొలగింపు పనులు అత్యధికంగా చేపడుతుండటంతో ఈ రోజుల్లో పనులకు వచ్చే కూలీల సంఖ్య కూడా పెరుగుతోంది.

జిల్లాలోని కూలీలకు రూ.41.40 కోట్ల అదనపు లబ్ధి

ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి ఉపాధి కూలీ రోజుకు రూ.300 చెల్లించనుండటంతో జిల్లాలోని ఉపాధి కూలీలకు అదనంగా రూ.41.40 కోట్ల లబ్ధి చేకూరనుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ఏలూరు జిల్లా పరిధిలో 1.38 కోట్ల పనిదినాలు కల్పించాలనేది లక్ష్యంగా నిర్దేశించారు.

పెరిగిన వేతనంతో ప్రయోజనం



ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఉపాధి కూలీలకు దినసరి వేతనంగా రూ.300 చెల్లించనుండటం వల్ల ఎంతో ప్రయోజనం చేకూరనుంది. వ్యవసాయ పనులు తక్కువగా ఉన్న సమయంలో, వేసవి కాలంలో అధికంగా ఉపాధి పనులు దొరుకుతున్నాయి. దీంతో ఎటువంటి ఇబ్బంది లేకుండా జీవనం సాఫీగా సాగిపోతుంది.

– మాండ్రు స్వాతి, మేట్, ముప్పవరం పంచాయతీ, దెందులూరు మండలం

వేసవి పనులు ఆదుకుంటాయి



ఉపాధి హామీ పథకం ద్వారా కల్పిస్తున్న పనుల ద్వారానే మా కుటుంబం జీవనం సాగిస్తోంది. పంచాయతీల ద్వారా ఎప్పటికప్పుడు పనులను గుర్తించడం వల్ల మాకు వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి పనులు ఎంతగానో ఆదుకుంటున్నాయి. గతంలో ఇచ్చిన దానికన్నా అదనంగా రూ.28 ఇవ్వాలని నిర్ణయించడం సంతోషకరం.

– లక్కబత్తుల రోజా, ఉపాధి కూలీ, ముప్పవరం, దెందులూరు మండలం

ఉపాధి పనులతో వలసలు తగ్గాయి



గతంలో పనులు లేని సమయంలో కూలీ పనులు వెదుక్కుంటూ దూర ప్రాంతాలకు, పట్టణాలు, నగరాలకు వలసలు పోవాల్సిన పరిస్థితులు ఉండేవి. నేడు ఆ పరిస్థితులు లేవు. వేసవిలో పనుల వల్ల ఉపయోగకరంగా ఉంటాయి. భార్యాభర్తలు పనికి వెళితే రోజుకు రూ.500 నుంచి రూ.600 వరకూ దినసరి వేతనం లభిస్తుంది. ఇబ్బందులు తీరుతాయి.

– పల్లా యేసేబు, పల్లావారిగూడెం, మొందూరు పంచాయతీ, పెదవేగి మండలం

మాదిగలను తాకట్టు పెడుతున్న మందకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న మంగరాజు

గణపవరం: రాజ్యాంగ నిర్మాత, దళితుల ఆరాధ్యదైవం డా.బీఆర్ అంబేద్కర్ అడుగుజాడలలో నడవాల్సిన ఎంఆర్‌పీఎస్ నేత మందకృష్ణమాదిగ దళితులను తాకట్టు పెడుతున్నారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు విమర్శించారు. వెంకట్రాజపురంలో గురువారం జరిగిన మండల మాలమహానాడు సర్వసభ్యసమావేశంలో ఆయన మాట్లాడారు. మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని తిరగరాస్తామని ప్రకటించిన బీజేపీకి మందకృష్ణమాదిగ మద్దతు ప్రకటించడం దారుణమన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే ఏంజరుగుతుందో అవ్వాతాతలకు పింఛను సొమ్ము సకాలంలో అందకుండా వలంటీర్లపై కోర్టు కేసులు, ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదులు చేయించడంతో బట్టబయలైందన్నారు. సకాలంలో పింఛను సొమ్ములు అందక ఆ పింఛనుపైనే ఆధారపడిన లక్షలాది మంది దళిత వృద్ధులు ఇబ్బందులు పడటానికి చంద్రబాబే కారణమని, అలాంటి కూటమికి గుణపాఠం చెప్పడానికి దళితులంతా ఏకం కావాలని పిలుపు ఇచ్చారు. రానున్న ఎన్నికలలో కూటమిని ఓడించి, మళ్లీ సంక్షేమపాలకుడు వైఎస్ జగన్‌ను అధికారంలోకి తీసుకురావడానికి పేదలంతా కంకణబద్ధులు కావాలని ఆయన కోరారు. సమావేశంలో మాలమహానాడు నాయకులు బాలకృష్ణ, పరమేశ్వరరావు, గోపి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీల్లో రూ.9 లక్షల నగదు సీజ్



జంగారెడ్డిగూడెం చెక్‌పోస్టు వద్ద రూ.7 లక్షల నగదును సీజ్ చేసిన ఎస్ఎస్‌టీ బృందం



పోలసానిపల్లిలో ఓ వ్యక్తి నుంచి నగదును స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

జంగారెడ్డిగూడెం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఏర్పాటు చేసిన ఎన్నికల చెక్‌పోస్టుల వద్ద గురువారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.9 లక్షల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జంగారెడ్డిగూడెం హైవేపై చెక్‌పోస్టు వద్ద ఎస్ఎస్‌టీ బృందం చేసిన తనిఖీల్లో ఓ వ్యక్తి స్కూటర్ డిక్కీలో తరలిస్తున్న రూ.7 లక్షల నగదును పట్టివేశారు. ఈ నగదుకు సంబంధించి సదరు వ్యక్తి ఎటువంటి ఆధారాలు చూపించకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు ఎస్సై జ్యోతిబాస్ చెప్పారు. నగదును ఏలూరు ట్రెజరీ కార్యాలయంలో జమ చేయనున్నట్లు తెలిపారు. తనిఖీల్లో ఎంపీడీవో కేవీ ప్రసాద్, ఎస్ఎస్‌టీ బృందం ఇన్‌చార్జి పి.బ్యూలా, కానిస్టేబుళ్లు జె.మోషే, రమణ పాల్గొన్నారు.

పోలసానిపల్లి వద్ద రూ.2 లక్షల పట్టివేత

భీమడోలు: పోలసానిపల్లి ఫ్లైఓవర్ సమీపంలో గురువారం ఫ్లెయింగ్ స్క్వాడ్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో ఓ వ్యక్తి నుంచి రూ.2 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలసానిపల్లికి చెందిన కె.రవికుమార్ ఓ కారులో ద్వారకాతిరుమల వైపు ఎటువంటి ఆధారాలు లేకుండా రూ.రెండు లక్షల నగదును తీసుకుని వెళ్తుండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన మొత్తాన్ని ఉన్నతాధికారులకు అప్పగించారు. తాను కోళ్లఫారం నిర్వహిస్తున్నందున మేత కొనుగోలుకు నగదును చెల్లించేందుకు తీసుకువెళుతున్నానని రవికుమార్ అధికారులకు తెలిపారు. ఫ్లెయింగ్ స్క్వాడ్ బృందం అధికారి ఎ.మాధవరావు, సీఐ బీబీ రవికుమార్ పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల తనిఖీ

ఏలూరు టౌన్: ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు ఏలూరు సీసీఎస్ సీఐ సీహెచ్ మురళీకృష్ణ ఏపీ, తెలంగాణ అంతరాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద గురువారం తనిఖీలు చేశారు. జీలుగుమిల్లి, మేడేపల్లి, వేలేరు, అల్లిపల్లి, సింగగూడెం చెక్‌పోస్టులను తనిఖీ చేసి సిబ్బందిని అప్రమత్తం చేసి వాహన తనిఖీలను పరిశీలించారు. సీసీఎస్ సీఐ మాట్లాడుతూ అంతరాష్ట్ర సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల్లో అక్రమాలకు తావులేకుండా ఎస్పీ పటిష్టమైన చర్యలు చేపట్టారని తెలిపారు. నగదు, మద్యం అక్రమ రవాణా కాకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

టీడీపీ ఫ్లెక్సీ తొలగింపుపై ఉద్రిక్తత

- నిబంధనలకు విరుద్ధంగా టీడీపీ ఫ్లెక్సీ ఏర్పాటు
- ఫ్లెక్సీ తొలగిస్తుండగా అధికారులను అడ్డుకున్న టీడీపీ కార్యకర్తలు

సాక్షి స్పందన



టీడీపీ కార్యాలయం వద్ద ఫ్లెక్సీని తొలగించడానికి వెళ్లిన ఎంసీసీ టీమ్

నూజివీడు: నిబంధనలకు విరుద్ధంగా టీడీపీ తాత్కాలిక కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలగించేందుకు వెళ్లిన ఎన్నికల అధికారులను, సిబ్బందిని టీడీపీ కార్యకర్తలు అడ్డుకుని వాగ్వివాదానికి దిగడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. నూజివీడులోని విజయవాడ రోడ్డులో ఈనెల 3న టీడీపీ తాత్కాలిక కార్యాలయాన్ని ప్రారంభించారు. అయితే కార్యాలయ ప్రహరీకి బయట భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దీనిపై 'టీడీపీ ఆఫీసుకు ఎన్నికల కోడ్ వర్తించదా?' అనే శీర్షికన 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఆర్డీఓ, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వై.భవానీశంకరి దృష్టికి ఈ విషయం వెళ్లగా, ఆమె అంతకు ముందు ఇచ్చిన ఆదేశాలను రద్దు చేసి, ఫ్లెక్సీని తొలగించాలని ఎంసీసీ టీమ్‌కు ఆదేశాలు జారీచేశారు. దీంతో సాయంత్రం 6 గంటల సమయంలో ఎంసీసీ సిబ్బంది పోలీసు బందోబస్తుతో ఫ్లెక్సీని తొలగించేందుకు వెళ్లగా కొందరు టీడీపీ కార్యకర్తలు అడ్డుకుని వారితో వాగ్వివాదానికి దిగారు. మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి, ఆర్డీఓ వై.భవాని శంకరి ఘటనా స్థలానికి చేరుకుని ఫ్లెక్సీని ఎందుకు తీయలేదని ప్రశ్నించారు. భారీ ఫ్లెక్సీల ఏర్పాటుకు వీల్లేదని స్పష్టం చేశారు. దీంతో వారు ఫ్లెక్సీని తొలగిస్తామని ఆర్డీఓకు తెలిపారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి సద్దుమణిగింది.

కారు ఢీకొని భార్య దుర్మరణం

ఏలూరు టౌన్: ఏలూరు ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో జాతీయ రహదారిపై కారు ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కృష్ణా జిల్లా గన్నవరానికి చెందిన తాతపూడి వెంకటరమణ, పద్మశ్రీ దంపతులు మోటారుసైకిల్‌పై ఈనెల 3న భీమడోలులోని బంధువుల ఇంటికి వివాహానికి వెళ్లారు. అదే రోజు అర్ధరాత్రి మోటారుసైకిల్‌పై గన్నవరం తిరిగి వెళుతుండగా ఏలూరు ఇంజనీరింగ్ కాలేజీ సమీపంలో వెనుక నుంచి వస్తున్న కారు వీరి మోటారు సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పద్మశ్రీ (54) ఘటనా స్థలంలోనే మృతి చెందగా, ఆమె భర్త వెంకటరమణ గాయాలపాలయ్యారు. వెంటనే అతనిని ఏలూరు జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై ఏలూరు త్రీటౌన్ సీఐ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు సిబ్బంది కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సారా విక్రేత అరెస్టు

ముసునూరు: సారా విక్రయించేందుకు తరలిస్తున్న ఓ వ్యక్తి అరెస్టు చేసి, అతని నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పి.వాసు గురువారం చెప్పారు. చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెంకు చెందిన వడిత్య స్వామి తన గ్రామంలో తక్కువ రేటుకు సారా కొని మండలంలోని లోపూడి తదితర గ్రామాల్లో అధిక ధరకు విక్రయిస్తున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్సై అతనిపై నిఘా పెట్టారు. గురువారం రాత్రి స్వామి యధావిధిగా యర్రావారిగూడెం నుంచి లోపూడికి వెళ్లగా, సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుడిని శుక్రవారం కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై చెప్పారు.

దుష్ప్రచారం తట్టుకోలేకే వలంటీర్ల రాజీనామాలు



అంబర్‌పేటలో రాజీనామాలు సమర్పించిన వలంటీర్లు

భీమడోలు : అంబర్‌పేటలో 14 మంది వలంటీర్లు గురువారం స్వచ్ఛందంగా మూకుమ్మడి రాజీనామాలు చేశారు. రాజీనామా పత్రాలను గ్రామ పంచాయతీ కార్య నిర్వాహక కార్యదర్శి వెంకట్రావుకు అందజేశారు. రాజకీయాలకు అతీతంగా నిస్వార్థ సేవలందిస్తున్న తమపై టీడీపీ కక్షసాధింపు చర్యలకు పూనుకుని వలంటీర్ వ్యవస్థపై విషం కక్కుతుందని వాపోయారు. వలంటీర్ వ్యవస్థపై టీడీపీ విమర్శిస్తున్న తీరు బాధాకరమన్నారు. పేదలకు సేవ చేసే అవకాశం లేనప్పుడు ఉచితంగా పారితోషకాలను తీసుకోవడం సబబు కాదని, అందులకే స్వచ్ఛందంగా తమ ఉద్యోగాల నుంచి తప్పుకుంటున్నామని వలంటీర్లు ముక్తకంఠంతో తెలిపారు.

వీరవాసరంలో..

వీరవాసరం : వీరవాసరంలో మండల వ్యాప్తంగా 100 మంది వలంటీర్లు గురువారం స్వచ్ఛందంగా రాజీనామాలు సమర్పించారు. ఆయా గ్రామాల్లోని గ్రామ సచివాలయ కార్యదర్శులకు రాజీనామా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవ్వాతాతలకు పెన్షన్‌తో పాటు ప్రజలకు ఏ అవసరం వచ్చినా ముందుండి సేవలందించామన్నారు.